అసమాన దాంపత్యం

'చౌదరి'

చౌదరయ్యగారు సామాన్యస్థితిపరులు. పూర్వులు సంపాదించిన మాగాణి పదిఎకరాలు, పెంకుటిల్లు ఉన్నాయి. ఋణపణాలు లేవు. సంసారపక్షంగా జరుపుకుంటే భుక్తికి లోటు లేదు. తాను తినావచ్చు, ఇతరుల కింత పెట్టావచ్చు. ఆయన పెద్ద కుమారుడు రామారాయుడు వీధిబళ్లోనే కొంత డొక్కశుద్ధి అయినతరువాత చదువు చాలించి వ్యవసాయపుపనుల్లో తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. రెండో పిల్లవాడు వెంకటరావు చదువువిషయంలోనే కొంతచిక్కు వచ్చింది. వెంకటరావుకు రెండు ఇంగ్లీషుముక్కలు చెప్పిస్తే చీటికిమాటికి బ్రాహ్మలచుట్టూ తిరగడం తప్పుతుందని చౌదరయ్యగారు కుఱ్ఱవాణ్ణి ఇంగ్లీషుబళ్లో ప్రవేశపెట్టాడు. వెంకటరావు చాల చులుకైనవాడు. ఒకటిరెండుసంవత్సరాల్లోనే 3-వ ఫారము పూర్తి చేశాడు. ఆఊళ్లో ఇంగ్లీషుచదువు అంతవరకే. ఇంకా చదువుకోవాలంటే ఏ బందరులాంటి బస్తీకో పోవాలి. బస్తీచదువుకు కావలసిన ఖర్చు భరించడానికి చౌదరయ్యగారి స్థితి చాలదు. చదువుచాలించి వ్యవసాయము చూచుకోమని తండ్రి కొడుకుతో అన్నాడు. స్కూలుఫయినలువరకైనా చదవాలని వెంకటరావు పట్టుపల. కుఱ్ఱవాడి మాట కాదనలేక చౌదరయ్యగారు వెంకటరావును బందరు హిందూ హైస్కూలులో ప్రవేశపెట్టాడు. వెంకటరావు స్కూలుఫయినలు ప్యాసు అయ్యేసరికి చౌదరయ్యగారి కుటుంబము కొంత ఋణములో పడ్డది. చదువు చాలించి యేదైనా నౌకరి సంపాదించుకుంటే ఋణము తీరుతుం దని చౌదరయ్యగారి ఆశ. బి. ఏ. ప్యాసు అయితేనేగాని ఉద్యోగం దొరకదనీ, అందుచేత బి. ఏ. చదవా లనీ వెంకటరావు పట్టుపట్టాడు. తండ్రికి ఇష్టము లేకపోయినా వెంకటరావు బందరుకాలేజీలో ప్రవేశించాడు. చౌదరయ్యగారు కొంత భూమిని సాహుకారు రామయ్యగారికి తాకట్టుపెట్టి అబ్బాయికి కావలసిన డబ్బు పంపిస్తున్నాడు. వెంకటరావు యఫ్. ఏ. క్లాసులో ఉండగా వెయ్యిన్నూటపదహార్లు కట్నము ఇచ్చి బి ఏ. కు కావలసిన ఖర్చు భరించుతామంటూ సంబంధాలు వచ్చినవి. బి. ఏ. ప్యాసు అయితేగాని పెండ్లి చేసుకో నని వెంకటరావు భీష్మించడంచేత సంబంధాలు తిరిగిపోతూవచ్చినవి. అసలు వెంకటరావు ఉద్దేశ్యం యేమంటే బి. ఏ. ప్యాసు అయి, స్త్రీపునర్వివాహమో, వర్ణాంతర వివాహమో చేసుకొని సంఘానికి మార్గదర్శకుడై దేశసేవ చెయ్యాలని. వెంకటరావు బి. ఏ. ప్యాసుఅయ్యేసరికి వారి కుటుంబానికి ఉండుకున్న పదియకరాల మాగాణి ఋణాలక్రింద పోయింది. ఇల్లు మిగిలింది. వెంకటరావు పట్టభద్రుడై ఇంటివద్దనే ఉంటున్నాడు. ఎంతప్రయత్నించినా తగిన ఉద్యోగం దొరకలేదు. చిన్నచిన్న ఉద్యోగాలుచేయడం వెంకటరావుకు ఇష్టంలేదు. ఉద్యోగం దొరక్కపోవడంచేత బి. యల్. చదివి చెక్కకట్టాలనుకున్నాడు, వెంకటరావు. అయితే డబ్బేదీ?

ఆరోజుల్లో కమ్మవారిలో ఇంగ్లీషు చదువుకున్నవాళ్లు బహు కొద్దిమంది. బి. ఏ. ప్యాసుఅయినవాళ్లు ఎక్కడనోగాని లేరు. స్థితిపరులై, ఆడపిల్లలు గల తండ్రులు బి. ఏ. లు తమకు అల్లుళ్లు కావాలని ఆశించేవారు. ఎంత రొక్కమయినా యిచ్చి అల్లుళ్లను కొంటూ ఉండేవారు.

వెంకటసుబ్బయ్యగారు కోడూరు కల్లా పెద్ద రయితు. సుక్షేత్రమయిన మాగాణి రెండువందల యకరాలు ఉంది. యీ భైనేలకుపైగా కవెలఉంది. ఆయనకు వరలక్ష్మి ఒక్కతేకుమార్తె. ఇద్దరు కుమాళ్లు. ప్రథమ సంతానమే వరలక్ష్మి. వెంకటసుబ్బయ్యగారిది చాలా గౌరవముగల కుటుంబము. గ్రామపెత్తనం మొదటినుంచీ వీరికుటుంబములోనే ఉంటూంది. కుటుంబ గౌరవం కాపాడుకుంటూ వెంకటసుబ్బయ్యగారు గ్రామంలో పెత్తనం చలాయిస్తున్నాడు. ఆయన

రెడ్డిగం వేసుకొని, రచ్చ బండదగ్గర కూర్చుని చిల్లర తగవులు విచారించి తీర్పుచెపుతూంటే రాజుగారు కొలువుతీర్చినట్లే ఉంటుంది. ఆయనమాటలధోరణిని బట్టి, ముఖవైఖరినిబట్టిచూస్తే విద్యాగంధం కలవాడుగా కనబడుతాడు. ఆయన తెనుగుచదువు చదువుకున్నవాడే. రామాయణభాగవతాలు స్వయంగా చదువుకొని అర్థం చేసుకోగలడు. తన తల్లిదండ్రులు తనకు ఇంగ్లీషు చెప్పించనందుకు చాలావిచారపడుతూఉంటాడు. తహశ్శీలుదార్లు వగైరా ఉద్యోగస్థులతో మాట్లాడుటకు తనకు ఇంగ్లీషురానందుకు సిగ్గుపడుతూ ఉంటాడు. తనపిల్లవాళ్లకి ఇంగ్లీషుచెప్పించాలని, తనకు ఇంగ్లీషు వచ్చిన అల్లుడు రావాలని ఆయనకోరిక.

వరలక్ష్మి చక్కనిచుక్క. తల్లిదండ్రులు ఆమెను అల్లారుముద్దుగా పెంచారు. ఆమెతల్లి వెంకమ్మగారు ఆమెకు కావలసినన్నినగలు చేయించి ఆమెను బంగారు బొమ్మగా తయారుచేసింది. వెంకమ్మ వరలక్ష్మిఒంటి నిండా నగలుపెట్టి, చక్కగా శృంగారించి ఆడుకోవడానికి పంపేది. ఒళ్ళు మట్టిచేసుకోవద్దనీ, ఆనుకునే పిల్లలని అంటుకోవద్దనీ చెప్పిపంపేది. వరలక్ష్మి ఆటల యందు అభిలాషకలది అయినా తల్లి కోప్పడుతుందనే భయముతో దూరముగా కూర్చుని తోడిపిల్లలు ఆడుకుంటూంటేచూచి ఇంటికి తిరిగివచ్చేది. తోడిపిల్లలు ఆమెనగలవంక ఆశ్చర్యముతో చూస్తుండేవారు. ఆమె సగర్వముగా వారివంక చూస్తుండేది. అలంకారప్రియత్వము ఆమెకోమలహృదయములో అంకురించి, వేరు బారింది.

వరలక్ష్మికి పన్నెండేండ్లురాగానే ఆమెకు వివాహముచేయవలెనని వెంకటసుబ్బయ్యగారు సంకల్పించారు. బి. ఏ. చదివిన కుఱ్ఱవాళ్లకొరకు దేశమంతా గాలించారు. వాకబుచేయగా చేయగా వెంకటరావు సంగతి తెలిసింది. ఆస్తి యేమీలేకపోయినా వెంకటరావు బుద్ధిమంతుడనీ, రూపవంతుడనీ వెంకటసుబ్బయ్యగారు విని అన్నివిధాలా వెంకటరావే తనకు తగిన అల్లుడని ఆయన నిశ్చయించుకున్నాడు. ఈసంగతి తన భార్య వెంకమ్మతో చెప్పాడు. ఆస్తిలేనివాడికి కిస్తే నలుగురిలో తలవంపుగా ఉంటుందని మొదట వెంకమ్మగారు ఇష్టపడలేదు. కాని కుమార్తె వరలక్ష్మిని మూడవ కుమారుడుగా భావించి తనఆస్తిలో 3 వ వాటాను పసుపూకుంకుముక్రింద వరలక్ష్మికి ఇస్తాననీ, అమ్మాయికి యేలోటూ జరుగనివ్వననీ వెంకటసుబ్బయ్యగారు నచ్చజెప్పినమీదట వెంకమ్మగారు సంబంధానికి ఒప్పుకున్నది. వెంకటసుబ్బయ్యగారు చౌదరయ్యగారికి కబురుచేశారు. చౌదరయ్యగారి ఆనందానికి మేర లేదు. కాని వెంకటరావుమాత్రము దిగులుపడ్డాడు. సంస్కరణ వివాహము చేసుకునే అవకాశము పోతుందన్నభయము ఒకవైపు, బి. యల్. చదవడానికి డబ్బు దొరుకుతుందన్న ఆశ రెండవవైపు ఆతని హృదయాన్ని కలవరపెట్టినవి. ఆశ గెలుపొందగా అతడు ఈ సంబంధానికి సమ్మతించాడు. ప్రధానం జరిగింది. సుముహూర్తము నిశ్చయించారు.

వెంకటసుబ్బయ్యగారు బ్రహ్మాండముగా పెండ్లి ప్రయత్నాలు చేయిస్తున్నారు. స్వంతజీతగాండ్లు, గ్రామస్థులు వచ్చి పందిళ్లు వేస్తున్నారు. వెంకటసుబ్బయ్యగారు డాబా అరుగుమీద తివాసీ వేసుకొని కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు. "మీఅల్లుడుగారు మీతో సమానమైన చెయ్యేనట్టే" అన్నాడు రామిరెడ్డి, వెంకటసుబ్బయ్యగారితో. వెంకటసుబ్బయ్యగారు చిరునవ్వు నవ్వాడు. వెంకటసుబ్బయ్యగారి భార్య వెంకమ్మ దర్వాజాలు కడిగి బొట్లు పెడుతూండగా ఇరుగుపొరుగు అమ్మలంతా వచ్చి "ఏమో నమ్మా, రత్నంలాటిపిల్లను బొత్తుగా లేనివాడికి ఇస్తున్నారు. చదువేమి బువ్వ పెడుతుందా? అందం కొరుక్కుతింటామా? మగవాళ్ల కేమిగాని కన్నతల్లివి నీవెలా యిష్టపడ్డావమ్మా?" అన్నారు. వెంకమ్మమనస్సు చివుక్కుమంది. ఏమి సమాధానము చెప్పడానికి ఆమెకు తోచలేదు. ఆక్షణంనుంచీ ఆమె మనస్సు కలత జెందింది. పెండ్లిపనులయందు ఆమెకు మనస్సు పోవడం లేదు. కళకళలాడే ఆమెముఖాన కారుమబ్బులు కనబడున్నాయి. ఆమె వరలక్ష్మిని చూచి కంట తడిపెట్టడం మొదలుపెట్టింది.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావు?" అన్నది వరలక్ష్మి. "మీ నాన్నకు పిచ్చిపట్టిందమ్మా. నే నెంత చెప్పినా వినరు. నిన్ను నిరుపేదకు ఇచ్చి పెండ్లిచేస్తున్నారు. నలుగురు నాలుగుమాటలు నన్నంటున్నారు. నేను పదిమందిలో తల యెత్తుకోవడానికి వీలులేకుండా ఉంది." అని తల్లి వెంకమ్మ దుఃఖము ఆపుకోలేక యేడ్చింది. వరలక్ష్మి ముఖము చిన్నబోయింది. కళ్ల వెంట నీళ్లు గిర్రున తిరిగినవి. కళ్ల నీళ్లు కళ్ల గ్రుక్కుకుంది. వరలక్ష్మి మనస్సు చెయ్యిపెట్టి కలచినట్లయింది. ఇంతకలవారిఇంట్లో పుట్టి, బొత్తుగా లేనివానిని చేపట్టడం ఆమెకు న్యూనతగా తోచింది. సహజగర్వము ఒక్కసారిగా పైకి ఉబికింది. "నాన్నా, నేను నీకంత బరువయ్యానా" అన్నది వరలక్ష్మి. వెంకటసుబ్బయ్యగారు వెనక్కు తిరిగి చూశాడు. వరలక్ష్మి తలుపునానుకొని తల వంచుకు నిలబడిఉంది. ఈమాట వరలక్ష్మిచేత ఎవరు అనిపించింది వెంకటసుబ్బయ్యగారికి తెలుసు. ఆయన నవ్వి, కుమార్తెను దగ్గరకుతీసుకొని ముద్దుపెట్టుకున్నాడు. "నేనుండగా నీ కేలోటూ జరుగదమ్మా" అన్నాడు, ఆయన నవ్వుముఖముతో. వరలక్ష్మి నవ్వుతూ లోపలికి పోయింది.

వరలక్ష్మివెంకటరావుల వివాహము సుముహూర్తాన అతివైభవంగా జరిగింది. అల్లుడు లేనివాడని తెలిసి ఉభయఖర్చులు వెంకటసుబ్బయ్యగారే భరించాడు. 30 యకరాలభూమి, వెయ్యిన్నూటపదహార్లురొఖ్ఖం వెంకటసుబ్బయ్యగారు అల్లుడుకట్నం చదివించాడు.

వరలక్ష్మినగలకుగాను చౌదరయ్యగారు నాలుగువందలరూపాయలు — అప్పుతెచ్చినబాపతు — చదివించాడు. పెండ్లికివచ్చిన వెంకటసుబ్బయ్యగారి బంధువర్గమంతా వెంకటసుబ్బయ్యగారిని చూచి మూతులు విరిచారు. నగలుక్రిందయిచ్చిన నాలుగువందలు చూచి ఆడంగులంతా చప్పరించారు. ఎవరేమనుకున్నా వెంకటసుబ్బయ్యగారుమాత్రము అల్లుణ్ణి చూచుకొని ఆనందపారవశ్యంచెందాడు. చదువుకున్న తన మిత్రులకు తన అల్లుణ్ణి చూపుకొని ఆయన గర్వించాడు. ఈ ఆనందమును అనుభవించడానికి వెంకటసుబ్బయ్యగారు నోచుకోలేదు. పెండ్లిఅయిన కొద్దిరోజులకే వెంకటసుబ్బయ్యగారు అకాలమృత్యువువాత బడ్డాడు. మామగారి మరణకాలమందు వెంకటరావు దగ్గరనేయుండి సర్వోపచారములు చేశాడు. మామగారి అకాలమరణానికి వెంకటరావు చాలా దుఃఖించాడు. అవివేకులైన లోకులంతా వెంకటరావును నిందించారు. "అల్లునిరాకడ, మామపోకడ" అని పదంకట్టారు. వెంకటరావు చాలా చికాకుపడ్డాడు.

వెంకటరావు అత్తవారియింటివద్దనే ఉంటున్నాడు. బి. యల్. చదువవలెనన్న అభిలాష అతనిని వీడలేదు. కాని డబ్బుదొరికే మార్గమేదీ? తనను కోరి తెచ్చిన మామగారు లేరు. బావమరదులు చిన్నవాళ్లు. ఒకనాడు వెంకటరావు అత్తగారింటి పడమటింటిలో భోజనము చేస్తున్నాడు. ఓరగిలవేసియున్న తలుపు చాటున అత్త వెంకమ్మగారు నిలబడియున్నట్లు వెంకటరావు కనిపెట్టాడు.

"మాగోల మాకుకొట్టింది" అన్నది అత్త వెంకమ్మగారు మెల్లగా. "ఏమి" అన్నాడు వెంకటరావు. "మా అమ్మాయిని మీకు ఇవ్వడం మాకెవ్వరికీ ఇష్టము లేదు. మీ మామగారి పట్టుదలమూలాన పెండ్లిఅయ్యింది. లేకుంటే —"అని యేమోచెప్పబోయి వెంకమ్మ యేడ్చింది. వెంకటరావుకు ఇది కొత్తసంగతే. అతని మనస్సు కలచినట్లయింది. అభిమానము ఒకసారిగా హృదయాన్ని ఆవహించింది. "మీ కెవ్వరికీ యిష్టము లేదా యేమి?" అన్నాడు వెంకటరావు తెచ్చిపెట్టుకున్న నవ్వుతో. "ఇష్టము లేకుంటే మాత్రము తప్పింది గనుకనా" అన్నది వెంకమ్మ, గద్గదస్వరముతో. "మీకు మా అమ్మాయిని యివ్వడంవిషయంలో మమ్ములను లోకమంతా చీవాట్లు పెట్టినవాళ్లే. ఎవరేమన్నా చేసేదేముంది? పడవలసిన రోజులు గదా అని నోరు మూసుకుంటున్నాము" అన్నది వెంకమ్మగారు, కొంచెము ధైర్యము తెచ్చుకొని. వెంకటరావుహృదయానికి ఈ మాటలు ములుకులులాగా తగిలినవి. అతనికి దుఃఖము పొర్లివచ్చింది. మగవాడగుటచేతను, క్రొత్తస్థల

మనుటచేతను దుఃఖముఆపుకొని తెచ్చుకున్న నవ్వుతో భోజనం పూర్తి చేసి లేచాడు. ఏమి తిన్నాడో అతనికి ఏమీ తెలియదు.

ఒకనాడు వెంకటరావు భోజనముచేసి తాంబూలము వేసుకుంటూ డాబా అరుగుమీద కూర్చున్నాడు. "బావమరదులు చూస్తే చిన్నవాళ్లు. మాకు బోలెడంత ఉంది. చదువుకున్నా పొట్టకూటికేగదా! మీరు మా యింటివద్దనే ఉండి వ్యవసాయం చేయించండి. ఏదో మీకు ఇంత ముట్టచెప్పుతాము" అన్నది వెంకమ్మ మెల్లగా. వెంకటరావు నిర్విణ్ణుడై పోయాడు. కొంతసేపటికి తెలివి తెచ్చుకొని "అల్లాగే లెండి" అన్నాడు. మరునాడు ఉదయము లేచి వెంకటరావు స్వగ్రామానికి వెళ్లిపోయాడు. సంతోషంగానే వెళ్లినట్లు అతడు కనబడ్డాడు. దుఃఖపూరిత హృదయముతో అతడు వెళ్లుచున్నట్లు అనుమానపడడానికి ఎవ్వరికి అతడు అవకాశము ఇవ్వలేదు.

వెంకటరావు స్వగ్రామమువెళ్లి తండ్రికి తెలియకుండానే, స్వంతపూచీమీద రెండువేలరూపాయలు అప్పు తీసుకొని మద్రాసువెళ్లి లాకాలేజీలో ప్రవేశించాడు. రెండుసంవత్సరాలు కష్టపడిచదివి, బి. యల్. పూర్తిచేసి బందరులో ప్రాక్టీసు పెట్టాడు. మద్రాసులో ఉండగా అప్పుడప్పుడూ శలవులలో అత్తగారింటికి వచ్చి వెంటనే పోతూఉండేవాడు.

బందరులో ఇల్లు అద్దెకుతీసుకొని, ప్రాక్టీసుపెట్టి, భార్యను పంపవలసినదిగా వెంకటరావు అత్తగారికి కబురుచేశాడు. పంపడానికి అత్తగారు అన్నిప్రయత్నాలుచేసి బయలుదేరడానికి సిద్ధపడింది. "అద్దెయింటికి కాపురానికి పంపడం ఏమిటమ్మా" అన్నారు ఇరుగుపొరుగు అమ్మలక్కలంతా. వెంకమ్మగారి మనస్సు చెదరిపోయింది. ఆమెకు దుఃఖము పొర్లివచ్చింది. కాని పైకిమాత్రము ఉబకనివ్వకుండా ఆపుకొని కుమార్తెను ప్రయాణముచేయించి, వెంటబెట్టుకొనిపోయి బందరులో ప్రవేశపెట్టి పదిరోజులుండి తిరిగివచ్చింది. వెంకటరావుప్రాక్టీసు ఒకమోస్తరుగా ఉంది. మితముగా వాడుకుంటే కాపురం జరగడం అంతకష్టం కాదు. వెంకటరావు తానుసంపాదించిన రూపాయో, అర్ధో పెట్టెలోవేసి తాళముచెవి పెట్టెమీదనే ఉంచుతాడు. ఎవరికికావలసినంత వారు వాడుకోవచ్చును. వెంకటరావుకు ఎట్టిఆక్షేపణ లేదు. కాని జమాఖర్చు వ్రాసుకునేందుకుమాత్రము ఎవరు ఎంతతీసుకుందీ ఆరా యివ్వాలి.

"ఇరవై రూపాయలు లెఖ్ఖకురాలేదు. నీవేమైనా తీశావా?" అన్నాడు వెంకటరావు భార్యతో ఒకనాడు. వరలక్ష్మి మాట్లాడలేదు. "జమాఖర్చు వ్రాయాలి. తీస్తే చెప్పు" అన్నాడు. "చీరలు తెప్పించుకోడానికి తీశాను. ఇవిగో తీసికోండి" అంటూ వరలక్ష్మి చెంగునఉన్న ఇరవై రూపాయలు విప్పి వెంకటరావుముందు పారవేశింది. వెంకటరావు తెల్లపోయి, కొంతసేపటికి తెలివితెచ్చుకొని, ఆరూపాయలు అక్కడనే విడిచిపెట్టి ఆఫీసులోకి వెళ్లి కూర్చున్నాడు. పార్టీలతో మాట్లాడుతున్నాడుకాని యేమి మాట్లాడుచున్నదీ అతనికే తెలియడంలేదు. అతని మనస్సు ఎక్కడనో ఉంది. కోర్టుకు తొందరగా పోవాలె. పది అయ్యింది. పదకొండు అయ్యింది. భోజనానికి పిలుపు రాలేదు. పిలుపుకొరకు కూర్చుంటే వేళ మించిపోతుందేమోనని వెంకటరావు లోపలికివెళ్లి కాళ్లుకడుక్కొని పీటమీద కూర్చున్నాడు. వరలక్ష్మి మాట్లాడకుండా వడ్డించింది. మామూలుగా నేతిగిన్నె దగ్గరపెడుతుంది. ఆరోజున నేతిగిన్నె దగ్గరలేదు. నేయి స్వయముగా వేసిపోతుందేమో నని వెంకటరావు అన్నము కలుపుకొని తినడం ప్రారంభించాడు. నేయి రాలేదు. ఒకవేళ నేయి వేయడం మరచిపోయిందేమోనని "నేయి తీసుకురా" అన్నాడు. "మీరు తెచ్చిన నేయి అయిపోయింది" అన్నది వరలక్ష్మి. "పోనీ, నీవు తెచ్చిందే తీసుకురా" అన్నాడు వెంకటరావు. వరలక్ష్మి మాట్లాడలేదు. నేయిలేకుండానే వెంకటరావు భోజనం పూర్తిచేసి కోర్టుకు పోయాడు. కోర్టులో స్నేహితులంతా అతన్ని చూచి "ఏమిరో వెంకటరావు, సుస్తీగా ఉన్నావా యేమి?" అన్నారు.

"ఎబ్బే లేదే" అన్నాడు వెంకటరావు.

లక్ష్మమ్మ వరలక్ష్మి పెదతల్లి కుమార్తె. ఆమె అత్తవారు లక్షాధికారులు. వందయకరాల పొలము, మేడా ఉన్నాయి వారికి. లక్ష్మమ్మ అంత అందమైనది కాదు. ఆమె భర్తకు ఆమెకు అంత అనుకూలము లేదు. కాపురానికి వెళ్లిన కొద్దిరోజులకే ఆమెభర్త ఆమె యందు విముఖుడు అయ్యాడు. ఆమెను విడిచిపెట్టా డని చెప్పడానికి వీలులేదు కాని, ఆమెభర్త సంవత్సరానికి యే పదిరోజులో మాత్రము ఇంటిదగ్గర ఉంటాడు. బస్తీ లలో తిరుగుతూ ఉంటాడు. బస్తీలలో అతనికి ఏమి పనో ఎవ్వరికీ తెలియదు.

"ఇంట్లో నలుగురు జీతగాండ్లు, దొడ్లో పది గొడ్లు ఉంటే అందం కాని, ఇవేమికాపురాలమ్మా, మజ్జిగతో సహా కొనుక్కుతాగడం!" అన్నది లక్ష్మమ్మ వరలక్ష్మితో.

"బ్రహ్మవ్రాత తప్పుతుందా?" అంది వరలక్ష్మి.

వరలక్ష్మికి లక్ష్మమ్మ జడవేస్తూంది. "నాయన చేయించిన నగలేనా, మీఆయన యేమైనా చేయించారా?" అన్నది లక్ష్మమ్మ వరలక్ష్మితో.

"నగలు కూడానా, గుడ్డలకు గతిలేకుండా ఉంటే? ఉప్పుతో సహా కోడూరునుంచి రావాలె. లేకపోతే పొయ్యిలో పిల్లి లేవదు" అన్నది వరలక్ష్మి.

"అన్నీ అక్కడనుంచి తెచ్చుకొని ఇక్కడ తినకపోతే, అక్కడే పడిఉంటే వేరేకాపురము, ఖర్చు తప్పుతుందిగా" అన్నది లక్ష్మమ్మ. అక్కగారి సలహా వరలక్ష్మిచెవులకు ఇంపుగానే ఉంది.

వెంకటరావు భోజనముచేస్తున్నాడు. లక్ష్మమ్మ వడ్డనచేస్తూంది. "నేనున్నాను కాబట్టి సరిపోయింది. నౌకరు లేకపోతే జరగడము ఎల్లాగ? అమ్మాయికి చిన్నతనము. ఎన్నడూ పనిముట్టుకొని యెరుగదు" అన్నది లక్ష్మమ్మ, వెంకటరావుతో. "నౌకరును ఉంచవద్దన్నానా" అన్నాడు వెంకటరావు. "మనకు తోడు నౌకర్లుకూడా యెందుకులెండి" అన్నది వరలక్ష్మి. అసలుసంగతి ఏమిటంటే, వరలక్ష్మి కష్టపడి పోతుందేమో నని వెంకటరావు నౌకరును పెట్టాడు. వరలక్ష్మి నౌకరుతో పోట్లాడి వెళ్లగొట్టింది. మరియొక నౌకరుకొఱకు వెంకటరావు ప్రయత్నము చేస్తున్నాడు. నౌకరుదొరకడం కొంత ఆలస్యము అయింది. నౌకరు చేస్తూండే పనుల్లో వీలైనవి కొన్ని వెంకటరావే చేస్తున్నాడు. లక్ష్మమ్మ పదిరోజులుండి అత్తగారింటికి వెళ్లి పోయింది. వరలక్ష్మికాపురం తనకు నచ్చలేదనీ, ఆమె చాలాయిబ్బందిపడుతూందనీ, తీసుకొచ్చి యింట్లోనే ఉంచుకోమనీ లక్ష్మమ్మ పినతల్లి వెంకమ్మకు కబురు చేసింది. వెంకమ్మమనస్సులో ఆందోళనకలిగింది.

ఒకనాడు వెంకటరావు జమాఖర్చు వ్రాసుకుంటూ పెట్టెదగ్గర కూర్చున్నాడు. రు ౨౫ లు ఖర్చు తేలలేదు. అడిగితే భార్యకు కోపమువస్తుందేమోనని కలంకొన పంటికి కొట్టుకుంటూ, నొసలు పైకెత్తి దీర్ఘముగా ఆలోచిస్తున్నాడు. వరలక్ష్మి వెంకటరావు ఆందోళన గ్రహించింది. కాని అడుగనిదే చెప్పడ మెందుకన్న అభిమానము ఆమెను మాట్లాడనివ్వలేదు. వెంకటరావు పుస్తకము అక్కడపెట్టి వెళ్లిపొయ్యాడు. మర్నాడు జమాఖర్చు వ్రాసుకుందామని పుస్తకము తీస్తే "కోడూరునుంచి వచ్చిన నేతిక్రిందఖర్చు" అని రు ౨౫ లు ఖర్చుపద్దు అతనికి కనబడ్డది. అతనిహృదయ భారం కొంత తగ్గినట్లయింది. అతను ఒకవిధమయిన శాంతి, ఆనందం అనుభవించాడు.

ఒకసారి ఇస్త్రీ చాకలివాడు గుడ్డలు తేవడం కొంత ఆలస్యమయింది. వెంకటరావు కోర్టుకు పోవ డానికి తలగుడ్డ లేకపోయింది. పెండ్లినాడు మామగారు చదివించిన పట్టుతలగుడ్డ ఒకటి తన భార్యపెట్టెలో నున్నట్లు వెంకటరావుకు జ్ఞాపకమువచ్చింది. "పట్టుతల గుడ్డ ఉండాలి నీవద్ద, ఇస్తావా" అన్నాడు వెంకట రావు. "పట్టుతలగుడ్డలు చుట్టారా ఇదివరకు" అన్నది వరలక్ష్మి చులకనగా. వెంకటరావు ఖద్దరుఉత్తరీయం తలకు చుట్టుకొని కోర్టుకు పోయాడు.

పిల్లలు లేకపోవడం వెంకటరావుకు కొంత దిగులుగానేఉంది. సంతానం భార్యాభర్తలను బంధించే సూత్రమనీ, తల్లిదండ్రుల హృదయకాఠిన్యాన్ని తొలగించి, వారి పరస్పర ప్రేమలను పవిత్రంచేయు సాధనమనీ ఆయన అభిప్రాయము. సంతానంకొఱకు వెంకటరావుహృదయము పరితపించుచున్నట్లు వరలక్ష్మి కనిపెట్టింది. "ఉన్నవాళ్లకే తిండిలేకపోతే, పైగా పిల్లలుకూడా ఎందుకులెండి" అన్నది ఆమె భర్తతో. "తిండిలేక చచ్చిపోతున్నామా" అన్నాడు వెంకటరావు. "పిల్లలను కని యేమిపంచిపెడతారు"అన్నది ఆమె. "మానాయన నాకేమిపంచిపెట్టాడు" అన్నాడు వెంకటరావు. "అందరూ మీవలెనే ఉండవలెననా మీకోరిక" అన్నది వరలక్ష్మి. వెంకటరావు వెఱ్ఱినవ్వుతో "నేనేమి తక్కువగా ఉన్నానా" అన్నాడు. "ఎక్కువగానే ఉన్నారు లెండి, లోకుల పిల్లలను ఏడ్పించడానికి" అన్నది వరలక్ష్మి. వెంకటరావు నివ్వెరపోయాడు. నోట మాటరాలేదు. ముఖాన చిరుచెమ్మటలుపట్టాయి.

వరలక్ష్మి ఒకనాడు ప్రొద్దున్నే లేచి, ఇంటిపనులు తొందరగా ముగించుకొని ఇంటిలో నిత్యకృత్యమునకు కావలసిన సామానుతప్ప తక్కినదంతా ఒక గదిలో సర్దించి స్నానముజేసి, తలదువ్వి, బొట్టుపెట్టుకొని ముస్తాబుఅయింది. వెంకటరావు అంతా చూస్తూనే యున్నాడు. కాని ఆమెను ఏమీ ప్రశ్నించలేదు. ౧౦ గంటలవేళ వెంకటరావు తలవంచుకొని భోజనంచేస్తున్నాడు. వరలక్ష్మి ముఖము ప్రక్కకుపెట్టుకొని క్రిందవంక చూస్తూ తలుపునానుకొని నిలబడిఉంది.

"నేను కోడూరువెళ్లుచున్నాను" అన్నది.

"ఎందుకు?"

"పనిఉంది."

"ఏమిపని?"

"ఊరకనే."

కొంచెముసేపు ఊరుకొని "ఎప్పుడు?" అన్నాడు వెంకటరావు.

"ఇప్పుడే" అన్నది వరలక్ష్మి.

"ఇప్పుడు బండిలేదు. నేను కోర్టునుంచి వచ్చి సాయంత్రము బండిలో పంపుతాను. వీలైతే నేనే వస్తాను" అన్నాడు వెంకటరావు. వరలక్ష్మి మాట్లాడలేదు. వెంకటరావు భోజనంచేసి కోర్టుకు వెళ్లిపోయాడు. సాయంత్రము ఇంటికి వచ్చేసరికి వరలక్ష్మి మోటారులో కోడూరు వెళ్లినట్లు వెంకటరావుకు తెలిసింది. అతని హృదయంలో ఏయేభావములు పుట్టి గిట్టెనవో మనకు తెలియదు.

వెంకటరావు హోటలునుంచి భోజనము తెప్పించుకుంటున్నాడు. వారము రోజులయింది. పది రోజులయింది. వరలక్ష్మి రాలేదు. తాను హోటలులో తింటున్నాననీ, పనులకు ఇబ్బంది కలుగుతూందనీ, భార్యను పంపమనీ,వెంకటరావు అత్తగారికి కబురు చేశాడు."మీరే వచ్చి తీసుకుపొండి" అని అత్తగారు జవాబు పంపించింది. తీరుబడి చూచుకొని వెంకటరావు కోడూరువెళ్లాడు. అద్దెకొంపలో కాపురముచేయడం తనకు న్యూనతగా ఉందనీ, వెంకటరావేవచ్చి తమయింటిలో ఉండవలసిందనీ అత్తవెంకమ్మగారు చల్లగా అందించింది. వరలక్ష్మి తల్లిప్రక్కనే నిలుచునిఉంది. వెంకటరావు మాట్లాడలేదు.

వెంకటరావు మర్నాడు పెందలాడే లేచి, భార్యఉన్న గదిలోకి వెళ్లి, కంఠము సవరించుకుంటూ, హీనస్వరంతో "వెళ్లుచున్నాను" అన్నాడు. వరలక్ష్మి మాట్లాడలేదు. "పొమ్మన్నావా?" అన్నాడు—

"మీయిష్టము" అన్నది వరలక్ష్మి.

వెంకటరావు తొట్రుబాటుతో బయటికి వచ్చి, అత్తగారితో చెప్పకుండానే బయలుదేరి బందరు చేరాడు. హోటలులో భోజనంచేస్తూ వెంకటరావు ఖులాసాగా కాలము వెళ్లబుచ్చుచున్నాడు. ప్రాక్టీసుకూడా కొంచెము ఎక్కింది. అతనిస్నేహితులు సాయంత్రము అతని ఇంటివద్ద చేరుతారు. సాంఘిక రాజకీయవిషయాలు చర్చించుతూ, స్నేహితులతో వెంకటరావు కాలము ఖులాసాగా గడుపుతున్నాడు. చదువుకునేరోజుల్లో అతనిముఖాన తాండ

వించిన చిఱునగవుదొంతరలు, నేత్రాల్లో కాంతులు మరల ఇప్పుడు కనబడుతున్నాయి. భార్యాభర్తలకు కొంతవైషమ్యము కలిగిందని అతని స్నేహితులు వారిలోవారు అనుకుంటూ ఉండేవారు. కాని ఆవిష యమై వెంకటరావును ప్రశ్నించడానికి ఒక్కరైనా సాహసించలేదు. అట్లా ప్రశ్నించడానికి వెంకట రావున్నూ అవకాశము ఇవ్వలేదు.

రెండుసంవత్సరాలు గడచినవి. వరలక్ష్మి బందరు రాలేదు. వెంకటరావు గోదూరుపోలేదు. ఒకనాడు వెంకటరావు ఆఫీసులో కూర్చుని పనిచూచుకుంటూ ఉండగా పోష్టువాడువచ్చి కవరుఒకటి యిచ్చాడు. చించిచూడగా అందులో వెంకటరావు పెద్దబావమరది నాగయ్య వివాహమహోత్సవాహ్వానపత్రిక ఉంది. మర్నాడే పెండ్లి. వెంకటరావు ఆలోచనలో పడ్డాడు. పెండ్లికివెళ్ళడమా, వెళ్ళకపోవడమా? ఇది సమస్య. తాను పెండ్లికి రావలెనని అత్తగారి కోర్కె అయితే ఉత్తరమువ్రాస్తారా? అందులోను పోస్టుద్వారా పంపుతారా? వెళ్లకపోతే లోకమేమంటుందో అన్నభయము అతన్ని బాధించడం మొదలుపెట్టింది. పోయిరావడమే మంచిదని నిశ్చయించుకొని, బావమరదికి చదివించడానికి కొన్నిపుస్తకాలు, అతనిభార్యకు చదివించడానికి పొందూరుఖద్దరుచీర తీసుకొని లగ్నసమయానికి గోదూరువెళ్లాడు. అక్కడ అతనిని పలుకరించినవాళ్లు లేరు. లగ్నంకాసేపు అక్కడఉండి చదివింపులకొఱకు తీసుకొనిపోయినవి అక్కడనే విడిచిపెట్టి వెంటనే బందరుచేరాడు. వెంకటరావు బందరుచేరిన కొంచెంసేపటికి పుస్తకాలు, చీరాకూడా తిరిగివచ్చినవి. వెంకటరావుకు దుఃఖంపొర్లివచ్చింది. తనలో తానే యేడ్చుకొని, తన్నుతానే ఓదార్చుకున్నాడు. భోజనంచేసి కోర్టుకు వెళ్లాడు. అతనిముఖము కళకళలాడుతుంది. ఆరోజున కోర్టులో బహుహుషారుగా పనిచేశాడు. ఇద్దరుముగ్గురు స్నేహితులకు టిఫినుకూడాయిప్పించాడు.

తరువాత రెండుమాసములకు, "బందరులో అంత శ్శాఖావివాహము" అను శీర్షికతో వెంకటరావు యశోదాబాయిగార్ల వివాహము కృష్ణాపత్రికలోపడ్డది. యశోదాబాయి తెలగ వెంకటస్వామి నాయుడుగారి కుమార్తె. ఆమెకు బాల్యంలో వైధవ్యం సంభవించింది. తండ్రి వెంకటస్వామినాయఁడుగారు కష్టపడి ఆమెకు బి. ఏ. వరకు చదువు చెప్పించాడు. సంఘసంస్కరణ ప్రియులగుటచే తన కుమార్తెను వెంకటరావుకు ఇచ్చి తన సంస్కరణాభిలాషను కార్యరూపంగా చూపించాడు.

వెంకటరావు పెండ్లివార్త వరలక్ష్మిచెవినిబడ్డది. తన తల్లిదండ్రులకంటె తెలివి తక్కువవారు లోకములో ఎవ్వరూలేరని ఆమెఊహ. అందుచేత ఆమె వెంకటరావు వివాహవార్త నిజమని నమ్మలేదు. క్రమముగా నిజమని తెలిసినతరువాత ఉదాసీనభావంతో ఆమె ఊరుకుంది.

వరలక్ష్మి సర్వదా అలంకరించుకొని పూచిన తంగేడులాగా ఉంటూంది. ఏనవలో, స్త్రీల వ్రతకథలో చదువుకుంటూ కాలము గడుపుతూంది. రెండుసంవత్సరాలు గడచినవి. కాపురముచేస్తూ కనీ పెంచవలసిన రోజుల్లో, కూతురు యెప్పుడూ తనకండ్లయెదుట ఉండడం వెంకమ్మకు కొంచెము భారంగా కనుపించడం మొదలుపెట్టింది. కాని కుమార్తెమనస్సు నొచ్చుతుందేమోనని ఆమె తనహృదయంలోనున్న భావాన్ని కప్పిపుచ్చేది.

ఒకనాడు వరలక్ష్మి చక్కగా శృంగారించుకొని రామిరెడ్డిగారి యింటికి పేరంటానికి వెళ్లింది. సాహుకారు వెంకటసుబ్బయ్యగారి కుమార్తెఅని వరలక్ష్మిని రామిరెడ్డిగారి ఆడంగులు ఎక్కువగా ఆదరించారు. కాని ఆమెను చూడగానే అక్కడనున్నవారిలో గుసగుసలు బయలుదేరినవి. "మొగుడు విడిచిపెట్టా"డని తనను చూచిన వారంతా అనుకుంటున్నట్లుగా ఆమె అలంకుపడ్డది.

పేరంటాండ్రలో చాలమంది పొరుగూళ్లవాళ్లు. అరవైసంవత్సరాల ముత్తైదువ గంగమ్మ వరలక్ష్మి మెడలో

నున్న జంటకాసులదండ చేతితో లాగి పట్టుకొని చూస్తూ "మీఅత్తవా రేవూరమ్మా?" అంది. వరలక్ష్మి సిగ్గుతో తలవంచుకుంది. "పిల్ల లెంతమందమ్మా?" అన్నది మరొక ఆవిడ. వరలక్ష్మిముఖము వివర్ణము జెందింది. ఆమె మాట్లాడలేదు.

వరలక్ష్మి ప్రశ్నపరంపరలకు గురిగావడం, సమాధానము చెప్పలేక బాధపడడం రామిరెడ్డిభార్య గ్రహించి, తెలివిగలది గనుక వరలక్ష్మిని దూరంగా తీసుకొనిపోయి తనకుమార్తెతో జతచేసింది. రామిరెడ్డి కుమార్తె నాగమ్మ, వరలక్ష్మి ఒక్కయీడువారే. ఒక బళ్లోనే చదువుకున్నారు. నాగమ్మ అత్తవారు సామాన్యస్థితిపరులే. ఆమె పండువంటి నలుగురు బిడ్డలతోను, భర్తతోను తండ్రిగారియింట్లో శుభకార్యమని వచ్చింది. నాగమ్మచంటిపిల్లవాడు నాగమ్మ ఒళ్లో కూర్చుని ఆడుకుంటున్నాడు. ఆ పిల్లవాణ్ణి వరలక్ష్మి తనదగ్గరకు లాగుకొని, ముద్దుపెట్టుకొని తన ఒడిలో కూర్చోబెట్టుకుంది. చంటిపిల్లవాని స్పర్శచే ఆమెఒళ్లు పులకరించింది. ఆమె హృదయతంతువు ఒకటి కదిలింది. అంతపనితొందరలోను నాగమ్మ తనభర్తసౌఖ్యాలను విచారించడం వరలక్ష్మికి ఆశ్చర్యముగా కనబడ్డది. ఆమె నాగమ్మను చూచి సిగ్గుపడ్డది. నాగమ్మ, వరలక్ష్మి గదిలో కూర్చునియుండగా నాగమ్మభర్త కోటిరెడ్డి లోపలికివచ్చాడు. కోటిరెడ్డి కురూపి అంటానికి వీలులేదుకాని నాగమ్మకు తగినభర్తకాడు. వెంకటరావుకు కోటిరెడ్డికి యెక్కడా పోలికలేదు. నాగమ్మకు కోటిరెడ్డియందు గల భక్తిశ్రద్ధలు వరలక్ష్మికి విపరీతంగా తోచింది. వారి అన్యోన్యము వరలక్ష్మికి అర్థంకాలేదు.

వరలక్ష్మి చిన్నబోయిన ముఖముతో ఇంటికి వచ్చింది. ఆమెఒంటిమీద ఇప్పుడు నగలులేవు. ఆమె పూర్వమువలె అలంకరించుకోవడం మానివేసింది. ఆమెకు అలంకారములయందు ఆసక్తితో పాటు శరీరంకూడా క్షీణించడం ప్రారంభించింది. అజీర్ణవ్యాధి ప్రవేశించింది. ఎన్నిమందులు ఇప్పించినా రోగము కుదిరేటట్టు కనబడలేదు. ఆమెరోగస్వభావమును చక్కగా గ్రహించింది ఆమెతల్లి వెంకమ్మ ఒక్కతే. తమ తప్పిదములను మన్నించి, తనకుమార్తెను పరిగ్రహించవలసిం దని పెద్దమనుష్యులద్వారా వెంకటరావుకు ఆమె కబురుచేసింది. వరలక్ష్మిని తాను విడిచిపెట్టలేదనీ, తననే వరలక్ష్మి విడిచిపెట్టిందనీ, అయినను వరలక్ష్మియందు తన కట్టిద్వేషము లేదనీ, కాని తన హృదయంలో వరలక్ష్మికి తావులేదనీ వెంకటరావు అన్నాడు. వచ్చిన పెద్దలు వెంకటరావుకు సమాధానము చెప్పలేక వెళ్లిపోయారు.

వెంకటరావు పాలిటిక్సులో ప్రవేశించి శాసనసభాసభ్యుడు అయ్యాడు. యశోదాబాయిని గవర్నమెంటువారు స్త్రీలతరఫున శాసనసభకు నామినేషను చేశారు. వెంకటరావు, యశోదాబాయిగార్లు కలిసి ఇప్పుడు విడియాకులచట్టముకొఱకు కృషిచేస్తున్నారు.